## క్లుప్తంగా

### సమన్వయంతో చెరువుల అభివృద్ధి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి

పెందుర్తి: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో చెరువులను అభివృద్ధి పథంలో నిలపాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.లక్ష్మీపతి సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం చెరువు ఆయకట్టుల అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెందుర్తి మండలంలో రెండు చెరువులను ధాన్ ఫౌండేషన్ దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాంపురం, నరవ చెరువుల పూర్తిస్థాయి అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. తహసీల్దార్ ఆనంద్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### విస్తం ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో నలుగురి ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

పెందుర్తి: మండలంలోని పినగాడి వెల్ఫేర్ ఇంజినీరింగ్(విస్తం) కళాశాలలో గురువారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో టెక్ తమ్మిన కంపెనీలో ఉద్యోగాలకు కంప్యూటర్ సైన్స్ విభాగం నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.శివప్రసాద్, కంపెనీ హెచ్‌ఆర్ జె.లేపాక్షి, ప్లేస్‌మెంట్ అధికారులు ఇ.కిరణ్‌కుమార్, ఎం.వి.జె.టి.అరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

### జాతీయ రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో సంస్కృతి గ్లోబల్ స్కూల్ సిబ్బంది

పరవాడ: జాతీయ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఢిల్లీ, భోపాల్‌లో ఈ నెల 13 నుంచి జనవరి 5 వరకు నిర్వహించనున్న 67వ జాతీయ రైఫిల్ షూటింగ్ పోటీలకు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎస్.సురేంద్ర, సాయిరవి, వి.భాను, పి.అక్షయ్‌లు ఎంపికైనట్లు పాఠశాల కోచ్ రామ్మోహనరావు గురువారం మీడియాకు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల సీఈవో కె.నిశాంత్ అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

### నేడు హనుమంతుని ఆలయంలో ప్రత్యేక పూజలు



సింహగిరి మెట్లమార్గంలో ఆంజనేయస్వామి

సింహాచలం: సింహగిరి మెట్లమార్గంలో కొలువైన ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం హనుమత్ వ్రతాన్ని విశేషంగా నిర్వహించేందుకు సింహాచలం దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 గంటల నుంచి పంచామృతాభిషేకాలు, 7.30 నుంచి లక్ష తమలపాకుల పూజ, 9 నుంచి పట్టాభిషేక పారాయణం, 9.30 నుంచి విశేష హవనం, పూర్ణాహుతి కార్యక్రమాలను జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులంతా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్సిందిగా దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ కోరారు.

'ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి మేం అడ్డుకాదు. కానీ పినగాడి–వేపగుంట రోడ్డును 150 అడుగుల వెడల్పున విస్తరిస్తే మా ఊరు మొత్తం పోతుంది. అప్పుడు మా పరిస్థితి ఏంటి. అధికారులు దీనిపై పునరాలోచన చేయాలి. రోడ్డు విస్తీర్ణాన్ని 60–70 అడుగులకు పరిమితం చేయాలి. లేదా ఊరు పక్క నుంచి బైపాస్ రోడ్డు వేయాలి'

.. ఇదీ పెందుర్తి మండలం పినగాడి వాసుల ఆవేదన



150 అడుగుల రోడ్డుకు ప్రతిపాదించిన పినగాడి రోడ్డు



ఆందోళన చేస్తున్న పినగాడి సర్పంచ్ వెంకటలక్ష్మి, జయరామ్, ప్రజలు

# విస్తరణ కాదు.. వినాశనం

- వేపగుంట–పినగాడి రోడ్డు 150 అడుగుల ప్రతిపాదనపై జనాగ్రహం
- పినగాడి మీదుగా అంత పెద్ద రోడ్డు అయితే ఊరే పోతుందని ఆవేదన
- అభివృద్ధికి అడ్డుకాదు.. మా ఉసురు తీయకండి అంటూ ఆందోళన
- రెవెన్యూ సదస్సులో అధికారులకు, ప్రజాప్రతినిధులకు గ్రామస్తుల మొర

పెందుర్తి: వేపగుంట–పినగాడి రహదారి విస్తరణపై రోజురోజుకూ వివాదాలు ముదురుతున్నాయి. ప్రస్తుతం 30 అడుగులు వెడల్పున ఉన్న ఈ రోడ్డును 150 అడుగుల రహదారిగా విస్తరించనున్నట్లు అధికారులు ప్రకటించడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. ఒకేసారి అంత భారీ వెడల్పున రోడ్డును విస్తరిస్తే పినగాడి గ్రామం మొత్తం తుడిచిపెట్టుకుపోతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లగా ఇక్కడ జీవనం సాగిస్తున్న తమ ఇళ్లు మొత్తం పోతాయని వాపోతున్నారు. ఈ మేరకు గురువారం పినగాడిలో జరిగిన రెవెన్యూ సదస్సులో అధికారులకు మొరపెట్టుకున్నారు. రోడ్డు విస్తీర్ణం తగ్గించడం లేదా ప్రత్యామ్నాయంగా గ్రామం వెలుపల నుంచి బైపాస్ రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు.

**ప్రత్యామ్నాయం ఉంది..**

అయితే వేపగుంట–పినగాడి రోడ్డు విస్తరణ కోసం 150 అడుగుల రోడ్డే నిర్మాణం చేయాలంటే గ్రామంలో నుంచి కాకుండా గ్రామానికి సమీపంలోని పొలాల మీదుగా నిర్మించేందుకు అవకాశం ఉంది. శ్రీరాంపురం సమీపం నుంచి పొలాల మీదుగా నేరుగా ఆనందపురం–అనకాపల్లి జాతీయ రహదారికి కలిపితే.. ఇటు ప్రజలకు ఇబ్బందులతో పాటు ప్రభుత్వానికి కూడా వ్యయం తగ్గుతుంది. అంతే తప్ప ఓ జాతీయ రహదారి స్థాయిలో ఆర్ అండ్ బీ రోడ్డును విస్తరించడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రజలకు అన్ని రకాలుగా మేలు జరిగేలా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

**అప్పుడలా..**

10 కిలోమీటర్ల పొడవున ఉన్న వేపగుంట–పినగాడి రోడ్డు వాస్తవంగా 60 అడుగుల వెడల్పు. ప్రస్తుతం 18 అడుగుల రోడ్డు ఉంది. ఇది శిథిలావస్థకు చేరడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరు చేశారు. 23 అడుగుల వెడల్పున విస్తరణ, మరో 12 అడుగుల వెడల్పున మట్టి కప్పేందుకు రూ.15 కోట్లు మంజూరు చేశారు. కల్వర్టుల నిర్మాణంతో పాటు మెటల్ పనులు ప్రారంభించారు. అయితే సదరు కాంట్రాక్టర్(ప్రస్తుత టీడీపీ మడకశిర ఎమ్మెల్యే) ఆఖరు నిమిషంలో పనులకు నిరాకరించడం, తర్వాత ఎన్నికలు రావడంతో శాశ్వతంగా రోడ్డు విస్తరణ ప్రక్రియ మూలకు చేరింది.

**ఇప్పుడిలా..**

తాజాగా ఈ రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం చర్యలు మొదలెట్టింది. 150 అడుగుల వెడల్పున రోడ్డును విస్తరించేందుకు ప్రతిపాదన చేస్తూ ప్రకటన విడుదల చేసింది. అదే జరిగితే పినగాడి గ్రామంలో దాదాపు వందకు పైగా కుటుంబాలు నివాసం కోల్పోతాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిపాదించిన ప్రకారం 23 అడుగులు వేసినా.. గత రికార్డు ప్రకారం 60 అడుగుల మేర విస్తరించినా గ్రామానికి అంతగా ఇబ్బంది ఉండదు. కానీ ప్రభుత్వం ఏకంగా 150 అడుగుల మేర రోడ్డును విస్తరించేందుకు ప్రతిపాదించడం అనాలోచిత నిర్ణయం అని గ్రామ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

### అభివృద్ధికి వ్యతిరేకం కాదు



వేపగుంట–పినగాడి రోడ్డు విస్తరణ చాలాకాలంగా ప్రజల కోరిక. అనివార్య కారణాల వలన గతంలో పనులు ఆగిపోయాయి. ఇప్పుడు ఈ రోడ్డును 150 అడుగులలకు విస్తరిస్తే పినగాడి గ్రామం సగానికి పైగా పోతుంది. ప్రజాప్రతినిధులుగా మేం అభివృద్ధికి వ్యతిరేకం కాదు. కానీ ఏకంగా ఊరే పోతుంది అంటే మేమెలా ఒప్పుకుంటాం. ఉన్నతాధికారులు స్పందించి గ్రామం వెలుపల నుంచి బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి. భూముల సేకరణ విషయంలో రైతులను మేం ఒప్పిస్తాం.

– బయిలపూడి వెంకటలక్ష్మి, సర్పంచ్, పినగాడి

### నష్టం చేకూర్చే అభివృద్ధి ఎందుకు



మా గ్రామం మీదుగా ఉన్న రోడ్డును విస్తరించాలని దశాబ్దకాలంగా ప్రభుత్వాలకు విన్నవిస్తున్నాం. గత ప్రభుత్వంలోనే రోడ్డు విస్తరణకు నిధులు వచ్చాయి. కానీ పనులు ఎందుకు ఆగిపోయాయో మాకు తెలీదు. తాజాగా 150 అడుగుల రోడ్డు అంటే మా ఊరు ఏమీ మిగలదు. మా రోడ్డు అభివృద్ధి అంటే మాకు అవసరమే. కానీ మాకు నష్టం చేకూర్చే అభివృద్ధి వద్దు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు ఇబ్బంది లేని నిర్ణయాలు తీసుకోవాలి.

– బి.ముత్యాలనాయుడు, పినగాడి

### మేం రోడ్డున పడతాం



రోడ్డు విస్తరణ వలన మాకు మేలు జరుగుతుందని అనుకున్నాం. కానీ ఏకంగా మా ఇళ్లే పోతున్నాయని తెలిశాక భయమేస్తోంది. పరిశ్రమల కోసం నిర్వాసితులైన గ్రామాల పరిస్థితి ఇప్పటికీ కనిపిస్తూనే ఉంది. రోడ్డు పేరిట మమ్మల్ని ఉన్న ఊరిని విడిచి పొమ్మంటే ఎక్కడికి పోయేది. మా బతుకుల పరిస్థితి ఏంటి. 150 అడుగుల రోడ్డు విస్తీర్ణం ప్రతిపాదనపై ప్రభుత్వం పునరాలోచించాలి. స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు మాకు న్యాయం చేయాలి.

– మలిరెడ్డి కనకమహాలక్ష్మి, పినగాడి

### నేటి నుంచి బంగారమ్మ పునఃప్రతిష్ట ఉత్సవాలు



విద్యుత్‌కాంతులతో అమ్మవారి నూతన ఆలయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవిరం బంగారమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవం, అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ట ఉత్సవాలను ఈ నెల 13 నుంచి 15 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు గురువారం తెలిపారు. 13న ఉదయం 8 గంటల నుంచి యాగశాల ప్రవేశం, ప్రతిష్టా సంకల్ప పఠనం, వినాయక పూజ, పుణ్యాహవచనం, రుత్విక్‌వరణం, సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురార్పణం, అగ్నిప్రతిష్ట, పూర్ణాహుతి, ధ్వజారోహణం ఉంటాయన్నారు. 14న మధ్యాహ్నం 3.45 గంటలకు ధాన్యాధివాసం, జలాధివాసం తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 15న ఉదయం 8.03 గంటలకు యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, శిఖరస్థాపన, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు, పరిసర గ్రామ ప్రజలు పాల్గొని, తరలించాల్సిందిగా కోరారు.

### ధనుర్మాసోత్సవాలకు ఏర్పాట్లు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి నిర్వహించనున్న ధనుర్మాస ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజార్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 13న భోగి పండగ నాడు అత్యంత వైభవంగా నిర్వహించే గోదా రంగనాయకుల కల్యాణంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా జనవరి 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని గిరి ప్రదక్షిణ, ఉత్తర ద్వార దర్శనం ఉంటాయన్నారు.

## అక్రమ మైనింగ్‌కు పాల్పడితే సహించబోం



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

- అవినీతి, అక్రమాల నిరోధానికి ప్రజలు ముందుకు రావాలి
- పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు
- పెందుర్తి మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో ఎక్కడా అనధికారిక మైనింగ్‌కు తావులేదని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు స్పష్టం చేశారు. ఎక్కడైనా అనధికారిక తవ్వకాలకు పాల్పడితే అర్ధరాత్రి తనకు సమాచారం ఇచ్చినా వారిపై చర్యలకు సంబంధిత యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తానని తెలిపారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మండల కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూ ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంతటివారైనా ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. నియోజకవర్గంలో అవినీతి అక్రమాల నిరోధానికి ప్రజాప్రతినిధులు, ప్రజలు ముందుకు రావాలన్నారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ముందంజలో నిలపాలన్నదే తన లక్ష్యమన్నారు. ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశాలకు గైర్హాజరయ్యే ప్రభుత్వ శాఖల సిబ్బంది, అధికారులపై చర్యలకు జిల్లా కలెక్టర్‌కు సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. పలు సమస్యలపై ప్రజాప్రతినిధులు ప్రశ్నలు సంధించగా సంబంధిత అధికారులు సమాచారం ఇచ్చారు. ఎంపీపీ మధుపాడ నాగమణి, ఎంపీడీవో వెంకట్రావు, ఎంపీటీసీలు, సర్పంచ్, అధికారులు పాల్గొన్నారు.

### కాలనీల్లో వసతుల కల్పనకు కృషి



కాలనీవాసుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: జీవీఎంసీ పరిధిలోని కాలనీల్లో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. జీవీఎంసీ 97వ వార్డు శాంతినగర్, ఎంఈఎస్ లే అవుట్, డాక్‌యార్డ్‌నగర్, ప్రసాద్‌నగర్, శక్తినగర్ కాలనీల్లో గురువారం ఆయన పర్యటించారు. స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు రమేష్‌బాబు సూచించారు. కార్పొరేటర్ శానాపతి వసంత, టీడీపీ నేత శానాపతి శంకర్రావు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్పొరేటర్ అక్రమాలను అడ్డుకోండి



వేపగుంటలోని జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు



ఏసీపీ రామలింగారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు టీడీపీ కార్పొరేటర్ శానాపతి వసంత, శంకర్రావు కుటుంబ సభ్యులు అనేక అక్రమ కట్టడాలకు, భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్, సమితి సభ్యుడు వై.రాంబాబు ఆరోపించారు. కార్పొరేటర్ చేపడుతున్న అక్రమ కట్టడాలపై గురువారం వేపగుంటలోని జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్రమణలకు, అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న ప్రజాప్రతినిధులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన ప్రజాప్రతినిధే ఆక్రమణలకు పాల్పడటం దారుణమన్నారు. అనంతరం ఏసీపీ రామలింగారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ ఆందోళనలో సీపీఐ నాయకులు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులతో దీర్ఘకాలిక భూ సమస్యలకు పరిష్కారం



గండి బాబ్జీకి వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ వెంకటలక్ష్మి, జయరామ్



వాడచీపురుపల్లి సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ అంబేడ్కర్



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ, తదితరులు

పెందుర్తి: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని రాష్ట్ర నూనె గింజల ఉత్పత్తిదారుల సహకార సంస్థ పర్సన్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి అన్నారు. పినగాడిలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని ప్రభుత్వం తరఫున రైతులు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్ని రకాలుగా ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. భూ సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. రెవెన్యూ యంత్రాంగం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి సకాలంలో మ్యుటేషన్, ఆన్‌లైన్ ప్రక్రియ, ఇతరత్రా అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి చేయాలని సూచించారు. వేపగుంట–పినగాడి రహదారి విస్తరణపై అభ్యంతరాలను స్థానికుల తరఫున సర్పంచ్ బయిలపూడి వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బయిలపూడి భగవాన్ జయరామ్‌లు గండి బాబ్జీకి వినతి రూపంలో అందించారు. సదస్సులో మొత్తం 13 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. తహసీల్దార్ ఆనంద్‌కుమార్, నాయకులు బయిలపూడి హరగోపాల్, వెన్నెల పెంటబాబు, సబ్బవరపు రాంకుమార్ పాల్గొన్నారు.

పరవాడ: రైతుల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో దోహదపడతాయని పరవాడ తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్ అన్నారు. వాడచీపురుపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు అందించిన అర్జీలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి, 15 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని కోరారు. చీపురుపల్లి పశ్చిమ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములు, చెరువులు, గెడ్డ వాగులను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు మాసవరపు అప్పలనాయుడు రెవెన్యూ అధికారులను కోరారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన 11 అర్జీలను అధికారులు స్వీకరించారు. సదస్సులో మండల సర్వేయర్ కర్రి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, సర్పంచ్ శివలంక లక్ష్మి, ఉప సర్పంచ్ శ్రీను, వీఆర్వో రొంగలి హేమలత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం: రైతుల భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ సూచించారు. మండలంలోని రాయపుర అగ్రహారంలో గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. పలు రకాల భూ సమస్యలపై 5 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. గ్రామంలో 672.65 ఎకరాల మొత్తం భూమిలో 183.56 ఎకరాల ప్రభుత్వ భూమి, 489.09 ఎకరాల జిరాయితీ భూమి ఉందన్నారు. గతంలో నిర్వహించిన రీ సర్వేలో 2,204 ఎల్‌పీఎంలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు, మండల సర్వేయర్ లాలం అప్పారావు, సర్వేయర్ రాము, వీఆర్వోలు కామరాజు, మాజీ సర్పంచ్ పిల్లల సోమేశ్వరరావు పాల్గొన్నారు.

## ఉచిత పశు గర్భ కోశ చికిత్స శిబిరం



సదస్సులో ప్రసంగిస్తున్న పశు సంవర్ధక శాఖ ఏడీ రామకృష్ణకీర్తి



పాడి రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందిస్తున్న సర్పంచ్ దేవి

పరవాడ: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియం చేసుకోవాలని పరవాడ పశుసంవర్ధకశాఖ అసిస్టెంటు డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణకీర్తి సూచించారు. తానాం గ్రామంలో రాష్ట్రీయ గోకుల మిషన్ సౌజన్యంతో ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కన్నూరి దేవి వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణకీర్తి మాట్లాడుతూ పశువులకు సోకే గర్భకోశ వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధిని గుర్తించిన వెంటనే మెరుగైన వైద్యం కోసం అందుబాటులో ఉన్న పశువైద్యులను సంప్రదించాలని సూచించారు. గర్భ కోశ వ్యాధుల నివారణ, లింగ నిర్ధారిత వీర్యంపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో 65 పశువులు, 22 లేగదూడలకు నట్టల నివారణ మందులు అందించారు. పాడి రైతులకు సర్పంచ్ దేవివెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావులు మినరల్ మిక్చర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ సురేష్, శివకుమార్, అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

## దేవీపురంలో మార్గశిర గురువారం పూజలు



అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న ప్రభాకరరావు, రాజ్యలక్ష్మి దంపతులు



మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న విద్యార్థులు, భక్తులు

సబ్బవరం: దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో మార్గశిర గురువారం సందర్భంగా పూజలు విశేషంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి అశేషంగా తరలివచ్చిన భక్తులు మహాలక్ష్మి అమ్మవారికి పంచామృత అభిషేకాలు, మహాలక్ష్మి హోమం నిర్వహించారు. మహాలక్ష్మి హోమంలో విద్యార్థులు పాల్గొని, అమ్మవారిని అర్చించారు. సాయంత్రం అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి తల్లిదండ్రులు ప్రభాకరరావు, రాజ్యలక్ష్మి దంపతులు, అమ్మమ్మ తాతయ్యలు అంజనయ్య, ధనలక్ష్మి దంపతులు అమ్మవారికి స్వయంగా కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి పవళింపు సేవలో పాల్గొన్నారు. మార్గశిర మాసంలో ప్రతి గురువారం దేవీపురం క్షేత్రంలోని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## గిరిజనులకు నృసింహ దీక్ష వస్త్రాల పంపిణీ



లోతేరు వేణుగోపాలస్వామి ఆలయంలో గిరిజనులకు దీక్ష వస్త్రాలు అందిస్తున్న సింహాద్రి మఠం గురుస్వామి సురేంద్ర

సింహాచలం: ఏజెన్సీ ప్రాంతాల్లో గురువారం 32 రోజుల శ్రీనృసింహ దీక్షలు తీసుకున్న గిరిజన దీక్షాధారులకు సింహాచలంలోని సింహాద్రి మఠం గురుస్వామి కశిరెడ్డి సురేంద్ర దీక్ష వస్త్రాలు అందించారు. అరకులోని లోతేరు రోడ్డులో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయం, ముంచంగిపుట్ రామాలయం, జీకే వీధి మండలం ఏబులంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయం, చింతపల్లి మండలం బొంగూడ గ్రామంలోని ఆలయంలో దీక్షలు తీసుకున్న సుమారు 650 మంది గిరిజనులకు ఈ వస్త్రాలను ఉచితంగా అందించారు. పురుషులకు పంచె, కండువా, చొక్కా పీస్, మహిళలకు చీర, కండువా ఇచ్చారు.